


జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ **వార్త** తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ **వార్త** తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - వర్కింగ్ ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

సోమవారం | 23-12-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 200 పేజీలు: 4 వెల : రూ.7



# కిలేడి

* లక్షకి రెండు లక్షలు, బంగారు బిస్కెట్లు అంటూ మోసగించిన మహిళ * సుమారు కోటి రూపాయలు వరకూ అప్పులు
* మోసపోయామని గుర్తించిన బాధితులు
* ఇంటికి వెళ్లి నిలదీత * పరారీలో మోసగత్తె దేవి
* ధర్నాకు సిద్ధమవుతున్న బాధితులు

**సంతబొమ్మాళి, డిసెంబర్ 22 (వార్త):** తక్కువ టైంలో ఎక్కువ డబ్బు సంపాదించాలన్న ఆశ.. పెద్దగా కష్టపడ కుండానే లక్షలకు లక్షలు కొల్లగొట్టేయాలన్న తపన.. అందుకోసం జనాలను ఏమార్చడమే పనిగా పెట్టుకుంది.. నౌపడకు చెందిన కిలేడి దేవి. లక్షకి రెండు లక్షలు, బంగారు బిస్కెట్లు ఇస్తానని చెప్పి పలువురు మహిళలను నమ్మబలికి వారి నుంచి సుమారు కోటి రూపాయలు వరకూ అప్పు తీసుకుని పరారీ అయింది. వివరాల్లోకి వెళితే.. సంతబొమ్మాళి మండలం నౌపడ గ్రామానికి చెందిన దుక్క దేవికి హైదరాబాదులో ప్రైవేట్ బ్యాంకులో జాబ్ చేస్తున్న లోకేష్ రెడ్డితో వివాహమైంది. లగ్జరీ లైఫ్‌కి అలవాటు పడిన దేవి తన భర్త బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడు అంటూ బంధువులు దగ్గర లక్షలు అప్పు చేసింది. నౌపడకు చెందిన పైల భాగ్యలక్ష్మి నుంచి రూ.32 లక్షలు, చుక్క బేబీ నుంచి రూ.18 లక్షలు, దాలమ్మ నుంచి రూ.3 లక్షలు, టెక్కలికి చెందిన దమయంతి నుంచి రూ.35 లక్షలు.. ఇలా మరి కొందరు నుంచి సుమారు కోటి రూపాయలకుపైనే దేవి అప్పులు చేసింది. అప్పులు ఇచ్చినవారు అడిగిన ప్రతిసారి లక్షకు రెండు లక్షల రూపాయలు ఇస్తానంటూ ఒకసారి, బంగారు బిస్కెట్లు, బంగారు దేవుడి ప్రతిమలు ఇస్తానంటూ మరోసారి నమ్మబలికింది. తన వద్ద ఉన్నాయంటూ బంగారు బిస్కెట్లు, ప్రతిమలు ఫోటోలు తీసి బాధితుల వాట్సాప్ నెంబర్‌కు పంపి మరింత నమ్మబలికింది. నెలలు గడుస్తున్నా నగదు గాని బంగారు బిస్కెట్లు గాని ఇవ్వకపోవడంతో బాధితులకు అనుమానం వచ్చింది. దీంతో దేవిని నిలదీయగా గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఇరువురి మధ్య రాజీ కుదిర్చారు. నగదు చెల్లించేందుకు కొంత గడువును కోరారు. అయితే గడువు తీరినా ఆమె అప్పులు తీర్చకపోవడంతో బాధితులందరూ దేవి ఇంటి వద్దకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఈ విషయం ముందుగా తెలుసుకున్న దేవి నౌపడ నుంచి పరారీ అయింది. అప్పులు ఇచ్చిన వారు ఆమె ఇంటికి వెళ్లగా దేవి లేకపోవడంతో కుటుంబ సభ్యులతో వాగ్వాదానికి దిగారు. ఇంటి ముందు ధర్నా చేయడానికి బాధితులందరూ సిద్ధమయ్యారు. ఆ సమయంలో దేవి బాధితులతో ఫోన్లో మాట్లాడి రెండు రోజుల్లో వస్తానని మీ అప్పులన్నీ తీర్చుతానని చెప్పడంతో ధర్నా చేయకుండా బాధితులు విరమించుకున్నారు. రోజులు గడిచిన దేవి రాకపోవడంతో బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈవిషయమై పోలీసులకు మాత్రం ఎవరూ ఫిర్యాదు చేయలేదు.



### ఫిర్యాదు ఇస్తే కేసు నమోదు చేస్తాం

అప్పులు తీసుకొని తిరిగి ఇవ్వడం లేదన్న విషయం నా దృష్టికి కొద్దిరోజుల క్రితం బాధితులు తెచ్చారు. ఇరువర్గాలను పిలిచి అడిగితే వారం రోజుల్లో ఇస్తామని బాధితులతో అప్పు తీసుకున్న ఆమె అన్నారు. రాతపూర్వకంగా బాధితులు ఎవరు ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు చేయలేదు.


**- నారాయణస్వామి, ఎస్సై నౌపడ**



# దొంగ దొరికాడు

* ఆరు చైన్‌స్నాచింగ్ కేసుల్లో వ్యక్తి అరెస్టు
* చోరీ సొత్తు రికవరీ * ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో చైన్‌స్నాచింగ్‌లు
* చైన్‌స్నాచింగ్ కేసులు ఛేదించాం
* పలు జంక్షన్లలో సీసీ కెమెరాలతో నిఘా
* ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి * పోలీసులకు ఎస్పీ ప్రశంస

**శ్రీకాకుళం క్రైం, డిసెంబర్ 22 (వార్త):** జిల్లాలో ఆరు చైన్ స్నాచింగ్ దొంగతనాలకు పాల్పడిన దొంగ నర్తు రాజేష్‌ను జిల్లా పోలీసులకు పట్టుబడ్డాడు. ఈ మేరకు ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆ వివరాలను ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి వెల్లడించారు. ఈనెల 16న కవిటిలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ ఉపాధ్యాయురాలిపై దాడి చేసి చైన్ స్నాచింగ్‌కు యత్నించిన దొంగ నర్తు రాజేష్ ఈనెల 21న కొజ్జీరియా జంక్షన్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో ఇచ్ఛాపురం పోలీసులు పట్టుకున్నారన్నారు. అతడిని కాశీబుగ్గ డీఎస్పీ అప్పారావు ఆధ్వర్యంలో పోలీసులు విచారించగా మరికొన్ని దోపిడీలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. గడిచిన ఆరు నెలల్లో కాశీబుగ్గ సబ్ డివిజన్ పరిధిలో కంచిలిలో రెండు, కవిటిలో రెండు, ఇచ్ఛాపురంలో రెండు దొంగతనాలకు పాల్పడి నట్టు విచారణలో నిందితుడు నర్తు రాజేష్ అంగీకరించాడన్నారు. ఈ ఆరు దొంగతనాల్లో రూ.7,76,959 విలువైన 8.25 తులాల బంగారం దొంగిలించినట్టు గుర్తించి ఆ బంగారాన్ని రికవరీ చేశామన్నారు. గతంలో ఖతార్‌లో లేబర్ వర్క్ చేసేందుకు వెళ్లిన రాజేష్ ఈ ఏడాది జూలై 20న తిరిగి వచ్చాడన్నారు. రాజేష్‌ది కవిటి మండలం బైరిపురం గ్రామమని ఎస్పీ తెలిపారు. జిల్లాలో గడిచిన ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది చైన్ స్నాచింగ్ దొంగతనాలు తగ్గాయని ఎస్పీ తెలిపారు. జిల్లాలో దొంగతనాలు జరిగిన ప్రాంతాలను గుర్తించి ఆ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు. కాశీబుగ్గ ఒడిశా ప్రాంతానికి ఆనుకుని ఉండడంతో ఇటువంటి దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. చోరీ కేసును ఛేదించిన ఇచ్ఛాపురం సీఐ ఎం.చిన్నంనాయుడు, ఇచ్ఛాపురం టౌన్ ఎస్ఐ ఇ.చిన్నంనాయుడు, కవిటి ఎస్ఐ వర్మ, ఏఎస్ఐ గోపాలరావు, కానిస్టేబుళ్లు ప్రసాద్, శ్రీను, బషీర్, రోణకేశ్వర రావులను ఎస్పీ అభినందించారు. సమావేశంలో ఏఎస్పీ కేవీ రమణ, కాశీబుగ్గ డీఎస్పీ ఎం.అప్పారావు, సీసీఎస్ ఎస్ఐ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.





జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## 45 మద్యం సీసాల స్వాధీనం



**సోంపేట, డిసెంబర్ 22(వార్త):** సోంపేట మండలం పొత్తంగి పంచాయతీ చౌకపేట గ్రామానికి చెందిన కదంబాల, పూర్ణచంద్ర అక్రమంగా నిల్వ ఉంచిన 45 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు బారువ ఎస్ఐ ఎస్.హరిబాబునాయుడు తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సోంపేట ఎక్సైజ్ సర్కిల్ పోలీస్ సిబ్బందితో కలిసి ఆదివారం దాడి చేశామన్నారు. గ్రామాల్లో అక్రమంగా మద్యం అమ్మకాలు ఎవరు జరిపినా చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో మద్యం, సారా అమ్మకాలు జరగ కుండా యువజన, మహిళా సంఘాలు చూడాలని ఆయన కోరారు.

# హరిపురం జీడిపిక్కల ఫ్యాక్టరీలో భారీ అగ్ని ప్రమాదం

### -రూ.కోట్ల ఆస్తి నష్టం



**మందస, డిసెంబర్ 22(వార్త):** హరిపురంలోని ఓ జీడిపిక్కల ఫ్యాక్టరీలో శనివారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో లక్షలాది రూపాయల విలువ చేసే వస్తువులు, సామగ్రి అగ్నికి ఆహుతైంది. హరిపురంలోని వెంకటబాలామణి జీడి ఫ్యాక్టరీలో శనివారం అర్ధరాత్రి హఠాత్తుగా మంటలు చెలరేగాయి. ఈ విషయం స్థానికులు గమనించి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వగా, పలాస, మందస అగ్నిమాపక కేంద్రాల నుంచి సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలను అదుపు చేశారు. ఈ మంటలు చుట్టు పక్కల ఉన్న ఫ్యాక్టరీలకు వ్యాపించకుండా నిలువరించారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. కాగా, ఫ్యాక్టరీలో నిలువ ఉంచిన జీడిపిక్కలు, ఇతర సామగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. రూ.కోట్లలో నష్టం ఉంటుందని అంచనా వేస్తున్నారు.

# వినియోగదారులకు ఆసరా సేవలు భేష్

### -జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి సూర్యప్రకాష్



**శ్రీకాకుళం, డిసెంబర్ 22(వార్త):** వినియోగదారుల హక్కులు, ప్రయోజనాల పరిరక్షణ కోసం కృషి చేస్తున్న సంస్థల్లో ఆసరా సంస్థ అగ్రస్థానంలో నిలుస్తుందని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి సూర్యప్రకాశరావు కొనియాడారు. శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆసరా బృందానికి అభినందన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్నో రకాల చట్టాలు తీసుకువచ్చిందన్నారు. ఈనెల 24న బాపూజీ కళామందిర్‌లో జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న వినియోగదారుల హక్కుల పరిరక్షణ సంఘాలు, వివిధ స్వచ్ఛంద సంస్థలు ప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరు కావాలని ఆయన కోరారు. అనంతరం ఆసరా సంస్థ ముద్రించిన వినియోగదారుల హక్కుల పరిరక్షణ గోడపత్రికలను వాకర్స్ ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆసరా సంస్థ శ్రీకాకుళం జిల్లా బాధ్యుడు, సీనియర్ న్యాయవాది గేదెల ఇందిరాప్రసాద్‌కు జ్ఞాపిక, ప్రశంసాపత్రం ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో ఆసరా సంస్థ రాష్ట్ర ప్రతినిధులు డాక్టర్ గంజి ఎజ్రా, సారథి, స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు పీజీ గుప్తా, శాసపు జోగినాయుడు, బీవీ రవిశంకర్, ఎస్.సంజీవరావు, గేదెల లక్ష్మి, వికాస్ విద్యా సంస్థల అధినేత కూన వేణుగోపాలరావు, లయన్స్ క్లబ్ ఆఫ్ అరసవల్లి ప్రెసిడెంట్ వావిలపల్లి జగన్నాథనాయుడు, బొడ్డేపల్లి ప్రసాదరావు, గోలి ఉమామహేశ్వరరావు, ఎండ మోహన్, రామ్‌భాయి, వాసంతి, విశ్వంభర సాహు, తంగుడి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల కవి సుబ్బారావు పాణిగ్రాహి




**మందస, డిసెంబర్ 22(వార్త):** ప్రజల కవి సుబ్బారావు పాణిగ్రాహి అని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు అన్నారు. మందస మండలం రట్టి గ్రామంలో కామ్రేడ్ సుబ్బారావు పాణిగ్రాహి 55వ వర్ధంతి సభను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లాఅధ్యక్షుడు మామిడి భీమారావు అధ్యక్షతన జరిగిన సభలో మాధవరావు మాట్లాడుతూ ప్రజల పక్షాన నిలబడ్డ కామ్రేడ్ సుబ్బారావు పాణిగ్రాహి ఎల్లవేళలా వారి హృదయాల్లో ఉంటారన్నారు. దోపిడీ, అసమానతలు లేని నూతన సమాజాన్ని ఆకాంక్షించి, అందుకు సాయుధ పోరాటం అవసరమని భావించి గన్ను పట్టి సాయుధ పోరులోకి నడిచారన్నారు. కార్యక్రమంలో అరుణోదయ సాంస్కృతిక సమైక్య జిల్లా అధ్యక్షుడు సొర్ర రామారావు, ఇఫ్టూ జిల్లా కన్వీనర్ జుత్తు వీరాస్వామి, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్, సవర బంగ్లాకుమార్, దాలయ్య, మహాలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

# రాయపూర్‌లో ద్వితీయ తెలుగు మహాసభలు

### -తెలుగు మహాసంఘం నిర్ణయం



**సోంపేట, డిసెంబర్ 22(వార్త):** రాష్ట్రస్థాయి ద్వితీయ తెలుగు మహాసభలు మే రెండో వారంలో రాయపూర్‌లో నిర్వహించాలని ఛత్తీస్‌గఢ్ తెలుగు మహా సంఘం నిర్ణయించింది ఆ సంఘం ప్రాంతీయ సమావేశం ఆదివారం రాయ్‌పూర్‌లోని బాలాజీ విద్యామందిర్‌లో అధ్యక్షుడు ఆర్.మురళి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మహా సభల సన్నాహాలు గురించి విస్తృతంగా చర్చించారు. ఛత్తీస్‌గఢ్‌లో సుమారు 70 ఏళ్ల నుంచి నివసిస్తున్నా, తెలుగు వారికి సామాజిక గుర్తింపు లేదని, విద్యా, ఉపాధి అవకాశాల్లో రిజర్వేషన్ సౌకర్యం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కల్పించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్థానిక రాజకీయ ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు సమర్పించాలని కన్వీనర్ రుద్రమూర్తి సంఘ ప్రతినిధులకు సూచించారు. సమావేశంలో బాలాజీ విద్యామందిర్ అధినేత జి.స్వామి, సలహాదారుడు ఎం.బాబూరావు, కోశాధికారి ఎన్.రమణమూర్తి, ఉపాధ్యక్షులు బి.జోగారావు, బి.వేణుగోపాలరావు, టి.శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి పి.ఆదినారాయణ, జి.రవి కన్న, సీహెచ్ భీమారావు, కె.వెంకటరావు, ఎస్ఆర్ఎన్ గజపతిరాజు, డి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

**రాజాం, డిసెంబర్ 22(వార్త):** రాజాంలోని పలు పాఠశాలల్లో ఆదివారం గణిత దినోత్సవం, శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామానుజన్ చిత్రపటానికి అధ్యాపకులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ గణితంతో ప్రయోజనాలను వివరించారు.

## ఆర్ఎంపీ జయచంద్ర మృతి



**మందస, డిసెంబర్ 22(వార్త):** మందసలోని బోయివీధికి చెందిన ఆర్ఎంపీ వై.జయచంద్ర(46) ఆకస్మికంగా మృతి చెందారు. బీఎస్సీ మైక్రో బయాలజీ చేసిన ఆయన ఈ ప్రాంతంలో మంచి వైద్య సేవలందించేవారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. జయచంద్ర మృతిపై పలువురు సంతాపం తెలిపారు.

## ఆదిత్యుడి ఆదాయం రూ.2.93లక్షలు

**శ్రీకాకుళం, డిసెంబర్ 22(వార్త):** అరసవల్లి సూర్యనారాయణస్వామిని ఆదివారం వందలాది భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా టికెట్లు రూపేణా రూ.62,500లు, పూజలు, విరాళాల రూపంలో రూ.83,459లు, ప్రసాదాల రూపంలో రూ.1,47,910లు స్వామి వారికి ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో యర్రంశెట్టి భద్రాజీ తెలిపారు.

## త్వరలో మాజీ సైనికుల యూనియన్ ఎన్నికలు



**ఆమదాలవలస, డిసెంబర్ 22(వార్త):** ఆమదాలవలసలో ఆదివారం మాజీ సైనికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ మాజీ సైనికుల సంఘ ప్రెసిడెంట్ సూర అవతారం మాట్లాడుతూ తన ఆరోగ్యం సహకరించడం లేదని, నూతన అధ్యక్షుడిని ఎన్నుకోవాలని కోరారు. ఆయన విన్నపం మేరకు ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహించాలని సభ్యులు నిర్ణయించారు. విశ్రాంత లెఫ్టినెంట్ కల్నల్ పి.శంకరరావు, విశ్రాంత సుబేదార్ మేజర్ బర్రి సంజీవరావు, విశ్రాంత సుబేదార్ గురుగుబెల్లి సత్యనారాయణ ఎన్నికల కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ సైనికుల జిల్లా సంఘం అధ్యక్షుడు కటకం పూర్ణచంద్రరావు, తాండ్ర జనార్దనరావు, బొడ్డేపల్లి శ్రీనివాస్, పేడాడ కృష్ణారావు, అన్నెపు మురళీ, పప్పల రాజారావు, పైడి సూర్యారావు, పొన్నాడ శ్రీనివాస్, సనపల రాములు, జి.రాజారావు, మాజీ సైనికులు పాల్గొన్నారు.

## విధుల్లో చేసిన సేవలు గుర్తింపునిస్తాయి

**పలాస, డిసెంబర్ 22(వార్త):** విధి నిర్వహణలో చేసిన సేవలు గుర్తింపునిస్తాయని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సంపతిరావు కిశోర్‌కుమార్ అన్నారు. కాశీబుగ్గ సూదికొండ యూపీ స్కూల్లో ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తూ ఇటీవల పదవీ విరమణ చేసిన జి.మధుసూదనరావు దంపతులను ఆదివారం కాశీబుగ్గ ఉన్నత పాఠశాల ఆవరణలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధుసూదనరావు ఎంతో మంది విద్యార్థుల ఉన్నతికి కృషి చేశారన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు గొంటి గిరిధర్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లండ బాబూరావు, బమ్మిడి శ్రీరామ్మూర్తి, జిల్లా సహాధ్యక్షులు కె.దాలయ్య జిల్లా కార్యదర్శి కె.రమేష్, జి.రమేష్, పలాస ఎంఈవో చెరుకుపల్లి సత్యం, యూటీఎఫ్ నాయకులు లఖినాన వెంకటాచలం, రవీంద్ర, టి.జయరాం, తమ్మినాన వైకుంఠరావు, సిద్ధు, దువ్వాడ జనార్దనరావు, టీడీపీ నాయకులు గురిటి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## అట్టాడ తరుణ్‌కు చంద్రబాబు ప్రశంసలు



**సంతబొమ్మాళి, డిసెంబర్ 22(వార్త):** సంతబొమ్మాళి మండలం వడ్డితాండ్ర పంచాయతీకి చెందిన అట్టాడ తరుణ్‌కుమార్‌కు టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నుంచి ఆదివారం ప్రశంసాపత్రం అందుకున్నారు. తరుణ్‌కుమార్ పార్టీకి సంబంధించిన యాప్ వినియోగంలో చురుకుగా పాల్గొన్నారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడానికి కృషి చేశారు. దీంతో ఆయనను చంద్రబాబు గుర్తించి, ప్రశంసించారు.



## నాగరాజు కుటుంబానికి శిరీష పరామర్శ

**పలాస, డిసెంబర్ 22(వార్త):** టీడీపీ నేత బడ్డ నాగరాజు కుటుంబాన్ని ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదివారం పరామర్శించారు. ఆయనను హత్య చేసేందుకు ఇటీవల కొందరు ప్రయత్నించి, పోలీసులకు చిక్కిన సంగతి తెలిసిందే. ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆమె వెంట వజ్జ బాబూరావు, పి.విఠల్ రావు, కుత్తుం లక్ష్మణరావు, పుచ్చ ఈశ్వరరావు, సూరాడ మోహనరావు, లొడగల కామేశ్వరరావు, భావన దుర్యోధన, సప్ప నవీన్, గాలి కృష్ణారావు, జీకే నాయుడు, దువ్వాడ శ్రీకాంత్, మల్ల శ్రీనివాస్, రవిశంకర్ గుప్తా, ఉమామహేశ్వరరావు, గోవిందు పాపారావు, పోతనపల్లి సాంబమూర్తి, ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## మంత్రి కొల్లు రవీంద్రతో శంకర్‌రెడ్డి భేటీ



**ఇచ్ఛాపురం, డిసెంబర్ 22(వార్త):** రాష్ట్ర ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్రను రాష్ట్ర తెలుగుదేశం పార్టీ రెడ్డిక బీసీ సాధికారిక చైర్మన్ కొండ శంకర్‌రెడ్డి కలిశారు. ఇటీవల రవీంద్ర సోదరుడు మృతి చెందారు. దీంతో మచిలీపట్నంలో వెళ్లి ఆదివారం ఆయనను శంకరరెడ్డి పరామర్శించారు.

## రేవంత్‌రెడ్డి నిర్ణయం హర్షణీయం



**శ్రీకాకుళం, డిసెంబర్ 22(వార్త):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బెనిఫిట్ షోలు, టిక్కెట్ల ధర పెంపు రద్దు చేయడం హర్షణీయమని ఎన్టీఆర్ అభిమాన సంఘం నేత పీవీ రమణ అన్నారు. ఆదివారం ఆయన శ్రీకాకుళంలో విలేఖరులతో మాట్లాడారు. గతానికి భిన్నంగా నిర్మాతలు అభిమానం చాటున దోచు కుంటున్నారని ఆరోపించారు. సినీ నిర్మాణానికి నిర్మాత సినీ అత్యధిక మొత్తంలో వెచ్చించారని అడ్డుగోలుగా సినిమా టికెట్స్ ధరలు పెంచుతూ ప్రత్యేక జీవోలు ప్రభుత్వాలు జారీ చేయడం చాలా దారుణం అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు నిర్మాతల దోపిడీ నుంచి ప్రేక్షకులను రక్షణ కల్పించాలని కోరారు.

## క్లస్టర్ లెవెల్ ..
## స్పోర్ట్స్ మీట్ విజయవంతం

**శ్రీకాకుళం, డిసెంబర్ 22(వార్త):** కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడలు మంత్రిత్వశాఖ, నెహ్రూ యువ కేంద్రం వారి ఆధ్వర్యంలో ఆదివారం క్లస్టర్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ శ్రీకాకుళంలో అరుగుల దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జిలు కళ్యాణి వెంకటరావు, తూతిక శంకరరావు, యువత ధర్మతేజ్, తనోజ్, తేజ, వరుణ్, యువకులు పాల్గొన్నారు.




# గణితంపై పట్టు.. పోటీ పరీక్షలు కొట్టు

### -ఎమ్మెల్యే గొండు శంకర్



**శ్రీకాకుళం, డిసెంబర్ 22(వార్త):** పోటీ పరీక్షల్లో రాణించాలంటే గణితంపై పట్టు సాధించాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ సూచించారు. శ్రీకాకుళంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో సిక్కోలు గణిత ఉపాధ్యాయ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం గణిత దినోత్సవం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సామర్థ్యాన్ని పెంచేలా అధ్యాపకులు బోధించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని, త్వరలోనే ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అందిస్తున్నారని తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పాఠశాల విద్యా బలోపేతంపై దృష్టి సారించారన్నారు. జిల్లాలో ఉపాధి అవకాశాలు పెరిగేలా ఐటీ హబ్‌లను నెలకొల్పుతున్నట్టు తెలిపారు.

కార్యక్రమంలో పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల గణిత ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ‘నక్షత్రబాట’ నవల ఆవిష్కరణ



**శ్రీకాకుళం, డిసెంబర్ 22(వార్త):** రచయిత అట్టాడ అప్పలనాయుడు రచించిన “నక్షత్ర బాట” నవల శ్రీకాకుళం సాయుధ పోరాట అమరవీరుల కుటుంబాల్లోని స్త్రీల త్యాగాలకు అద్దం పడుతోందని మాతృక మాసపత్రిక సంపాదక సభ్యురాలు బత్తుల రమా సుందరి అన్నారు. శ్రీకాకుళంలోని వరం రెసిడెన్సీలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆ నవలను అమరవీరుల పిల్లలైన పంచాది రోజా, అత్తలూరి అరుణ, తామాడ అరుణతో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉత్తరాంధ్ర విప్లవ ఉద్యమ సమాచారం, చరిత్రను స్మరించడమే కాకుండా సాహిత్యంలో, వర్తమాన సమాజంలో వాటిని నిక్షిప్తం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అమరవీరుల పిల్లల పంచాది రోజా, తామాడ అరుణ, అత్తలూరి అరుణ మాట్లాడుతూ తమ తల్లిదండ్రులు ప్రజల పక్షాన పోరాడినందుకు ఎంతో గర్వంగా ఉందన్నారు. వంకల మాధవరావు, రామచంద్రరావు, కుత్తుం వినోద్, తదితర గాయకులు తమ పాటలతో ప్రేక్షకులకు ఉత్తేజం కలిగించారు.

కార్యక్రమంలో కంచరాన భుజంగరావు, గంటేడ గౌరునాయుడు, చీకటి దివా కర్, గార రంగనాథం, వీజీకే మూర్తి, కేతవరపు శ్రీనివాసరావు, కె.నాగమణి, సీనియర్ పాత్రికేయుడు నల్లి ధర్మారావు, అల్లాడ లక్ష్మి, సిరికి స్వామినా యుడు, చింతాడ తిరుమలరావు, పిల్ల తిరుపతిరావు, తామాడ త్రిలోచన, మా మిడి క్రాంతి, డాక్టర్ కె.ఉదయ్‌కిరణ్, బాడాన శ్యామలరావు, బాల సుధాకర్ మౌళి, సాహితీ అభిమానులు, విద్యావే త్తలు, అభ్యుదయ, ప్రజా సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మూఢ నమ్మకాల నిర్మూలనపై వీడియో పోటీలు



**పలాస, డిసెంబర్ 22(వార్త):** సుస్థిరాభివృద్ధి, మూఢ నమ్మకాలు, శాస్త్రీయ దృక్పథం అనే అంశాలపై వీడియో తీసి పోటీలకు పంపించాలని జ్ఞాన విజ్ఞాన వేదిక సభ్యులు కోరారు. కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఆ సంఘ ప్రతినిధులు యురేకా సైన్స్ ఎక్స్పో-2025 పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ మాట్లాడుతూ 8, 9, 10 తరగతుల విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలపై వీడియో పోటీలను నిర్వహించి, ఫిబ్రవరి 15న (గెలీలియో జయంతి) ఫలితాలను వెల్లడిస్తామన్నారు. ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవం, జనవిజ్ఞాన వేదిక ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో బహుమతులను అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక విద్యా సబ్ కమిటీ జిల్లా కన్వీనర్ పాలవలస ధర్మారావు, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సంపతిరావు కిశోర్‌కుమార్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లండ బాబూరావు, బమ్మిడి శ్రీరామ్మూర్తి, జిల్లా సహాధ్యక్షులు కె.దాలయ్య జిల్లా కార్యదర్శులు కె.రమేష్, జి.రమేష్, పలాస ఎంఈవో చెరుకుపల్లి సత్యం, జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి ఎల్వీ చలం, నాయకులు రవీంద్ర, టి.జయరాం, తమ్మినాన వైకుంఠరావు, సిద్దు, యూటీఎఫ్ జిల్లా నాయకులు జి.మధుసూదనరావు, గుంట కేశవరావు, నాయకురాలు జయప్రద, పలాస మందస, నందిగాం మండలాల నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా పాణిగ్రహి వర్ధంతి వేడుకలు

**పలాస, డిసెంబర్ 22(వార్త):** బొడ్డపాడు గ్రామంలో ఆదివారం పాణిగ్రాహి 55వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. తొలుత అమరవీరుల స్మారక భవన ప్రాంగణంలో సురేఖ పాణిగ్రాహి కార్మిక వర్గ పతాకావిష్కరణ చేశారు. ఆ సందర్భంగా ప్రజా కళా మండలి నాయకుడు నీలకంఠం విప్లవ గీతాలను ఆలపించారు. ప్రజా నాట్య మండలి వారు నృత్య ప్రదర్శన గావించారు. కార్యక్రమంలో ఏబీఎంఎస్ రాష్ట్ర బాధ్యులు కామ్రేడ్ పద్మకుమారి, నాయకులు భైరి నరేష్, కాంగ్రెస్ నేత నీలకంఠం, డీటీఎఫ్ నాయకులు కె.ధర్మారావు మాస్టారు, పత్రి దానేష్, బలిమెల ప్రభాకర్, సాలిన వీరస్వామి, తామాడ సన్యాసిరావు, నాగమణి, దుర్యోధన, మద్దిల రామారావు, దుష్యంత్, అప్పయ్య, అప్పారావు, జనసంస్కృతి మండలి సభ్యులు గేదెల జగదీశ్వరరావు, నెయ్యిల యుగంధర్, బొడ్డపాడు యువజన సంఘ సభ్యులు మద్దిల కైలాస్, పోతనపల్లి మురళి, గేదెల దీపు, పోతనపల్లి షణ్ముఖరావు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ఘనంగా శారదామాత జయంతి



**పలాస, డిసెంబర్ 22(వార్త):** కాశీబుగ్గ శారదానగర్‌లోని శారదాపీఠంలో ఆదివారం శారదామాత 172వ జయంతి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. శ్రీవివేకానంద రామకృష్ణ సేవా సంఘం ఆధ్వర్యంలో తొలుత ప్రత్యేకపూజలు జరిపారు. అష్టోత్తరస్తోత్రం, రుద్ర పారాయణం, లలిత సహాస్ర పారాయణం, భజన, అరకటం కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం గావించారు. కార్యక్రమంలో ఆ సంఘం కార్యవర్గ సభ్యులు, దాతలు తదితరులు పాల్గొన్నారు.

# చివరి ఆశలూ..ఆవిరి..!

**-వందలాది ఎకరాల్లో పంటకు నష్టం**

**-పొలాల్లో కోతకు నోచుకోని వైనం**

**(మందస)**

మందస మండలంలోని అన్నదాతకు అష్టకష్టాలు తప్పలేదు. మొన్నటి వరకు వర్షాలు లేక ఇబ్బంది పడిన వారు నేడు అధిక వర్షాలతో నష్టపోతున్నారు. అకాల వర్షాలు అన్నదాతకు తీవ్ర నష్టాన్నే మిగిల్చాయి.

మండలంలోని కళింగదళ్, దామోదరసాగరం, సంకుజోడు, గోపాలసాగరం, డబార్సింగి, చీపిగెడ్డ, సునాముది, మహేంద్రతనయ తదితర సాగునీటి వనరులకు సంబంధించిన ఆయకట్టు పరిలో వరిపంట రైతులకు ఆశలు కల్పించింది. ఖరీఫ్‌లో వేసిన వరి పంటను రైతులు కొన్ని చోట్ల కోయగా, మరికొన్ని చోట్ల కోతలకు సిద్ధపడ్డారు. ఈ తరుణంలో అకాల వర్షాలు అన్నదాత ఆశలను అడియాశలు చేశాయి. ఎక్కడ కోసిన పంట అక్కడనే నీటిలో మునిగిపోగా, కోయని పంట కూడా తుపానుకు పూర్తిగా పాడైంది. పొలాల్లోని ఓగులు నీటిలో మునిగిపోవడంతో రైతన్నలు ఏమిటీ వైపరీత్యమని తలలు పట్టుకుంటున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే తాము ఎలా బతి కేది అంటున్నారు. ప్రకృతి కోపానికి గురైన వీరంతా తమకు దిక్కేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోసిన పంట వర్షంలో మునిగిపోగా, ఇంకా కోయని వారి పరిస్థితి ఏమిటోనని ఆకాశం వైపు చూస్తున్నారు. ప్రతీ రోజూ వర్షాలు కురుస్తుండడంతో రైతులు రబీ పంట కూడా ఇక తమకు దక్కదని విలపిస్తున్నారు. నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకుంటే తప్ప మనుగడ లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంతో వ్యయ ప్రయాసలతో పండించిన పంట మూడు రోజుల నుంచి కురిసిన వానలతో దక్కకుండా పోయిందని రైతులు మహేంద్ర, బెస్త కామేశ్వరరావు, మామిడి మాధవరావు ఆవేదన వ్యక్తం చేశారు. తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, రైతులకు ఒక ఎకరానికిగాను రూ.20వేల చొప్పున నష్టపరిహారం ప్రభుత్వం అందించాలని వారు కోరారు.







## రైతులను ఆదుకోవాలి



**ఇచ్ఛాపురం, డిసెంబర్ 22(వార్త):** అకాల వర్షాలతో నష్టపోయిన రైతుల పంట పొలాలను ఆదివారం జనసేన నాయకుడు యాదవ కార్పొరేషన్ డైరె క్టర్ దాసరి రాజు పరిశీలించారు. రైతుల కష్టనష్టాలను అడిగి తెలుసుకు న్నారు. పంట కోసే యంత్రాలు, దుక్కు యంత్రాల విషయంలో ప్రభుత్వం ఓ రేట్‌ను నిర్ణయించేలా కృషి చేయాలని ఓ మహిళా రైతు ఆయనను కోరారు. ఈ విషయం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తానని ఆమెకు ఆయన హామీ ఇచ్చారు. ఆయన వెంట ఇచ్ఛాపురం మున్సిపల్ ఇన్‌చార్జిలు రోకళ్ల భాస్కర్, నరసింహ, సోమేష్, ప్రేమ్‌కుమార్, హేమంత్, నరసింహ, శ్యామ్‌కుమార్, ఢిల్లీ, యర్రయ్య, వెంక ట్, సంతోష్ ఉన్నారు.

## నీట మునిగిన పెసర.. రైతులు లబో..దిబో..!

**రాజాం, డిసెంబర్ 22(వార్త):** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండంతో మూడు రోజులుగా కురిసిన వర్షాలు రైతులను కన్నీరు పెట్టిస్తున్నాయి. రాజాం మండలంలోని గుయ్యానవలస గ్రామంలో పెసర పంట పొలాల్లో వర్షం నీరు నిలిచి, పంట పూర్తిగా పాడైంది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.



# సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి

**-ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి**




**శ్రీకాకుళం, డిసెంబర్ 22(వార్త):** వార్షిక తనిఖీల్లో భాగంగా ఆమదాలవలస పోలీస్‌స్టేషన్‌ను ఆదివారం ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి సందర్శించారు. స్టేషన్ పరిసరాలు పరిశీలించి, సిబ్బంది విధులపై ఆరా తీశారు. సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వృత్తి నైపుణ్యాన్ని పెంచుకుంటూ, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. మహిళా పోలీసులతో ముఖాముఖి మాట్లాడి, సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని వారిని ఆదేశించారు. పలు రికార్డులను పరిశీలించి, గ్రేవ్ కేసుల దర్యాప్తుపై ఆరా తీశారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామాల్లో శాంతి భద్రతలపై సరైన సమాచారాన్ని సేకరిస్తూ, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు పటిష్టంగా పెట్రోలింగ్ నిర్వహించాలని, డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించి ప్రమాదాలను నివారించాలన్నారు. ప్రతిరోజూ విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కేసులు నమోదు చేయాలని సూచించారు. ఆయన వెంట డీఎస్పీ వివేకానంద, ఆమదాలవలస సీఐ, ఎస్ఐ ఉన్నారు.



## ఘనంగా విభూది జన్మదిన వేడుకలు

**శ్రీకాకుళం, డిసెంబర్ 22(వార్త):** శ్రీకాకుళం నగరంలోని 31వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి విభూది సూరిబాబు జన్మదిన వేడుకలు ఆదివారం ఆయన నివాసంలో స్థానికుల సమక్షంలో ఘనంగా జరిగాయి. ఆయన కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికులు తనపై చూపుతున్న అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు. డివిజన్‌లో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే ఎమ్మెల్యే, కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధి దిశగా కృషి చేస్తోందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతున్నారన్నారు. ఈ సందర్భంగా ఆయనకు డివిజన్ ప్రజలు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చంద్రభూషణ్, జయరాం, శంకర్, శ్రీనివాస్, రమేష్, చిట్టిబాబు, నాగరాజు, అప్పారావు, నదీమ్ తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి బాటలు వేద్దాం

**-జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య**



**శ్రీకాకుళం, డిసెంబర్ 22(వార్త):** విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించడంలో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ కీలక పాత్ర పోషిస్తుందని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ తిరుమల చైతన్య అన్నారు. జిల్లాలోని స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లకు వారం రోజులుగా నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ ఆదివారంతో ముగిసింది. ఈసందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలను ప్రారంభించాలని సూచించారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఈ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని, విద్యార్థులు సమాజ సేవ, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ అలవర్చుకుంటారన్నారు. ఈ శిక్షణలో 36 మంది స్కౌట్ మాస్టర్లు, 33 మంది గైడ్ కెప్టెన్లు పాల్గొన్నారు. వివిధ రంగాల నిపుణులు డీఎల్ నారాయణ, బి.శివ నాగిరెడ్డి, కె.దుర్గానాగేశ్వరరావు, పి.సుశీల, జి.బుజ్జిబాబు, రాజేశ్వరి, ప్రమీల ఈ శిక్షణను నిర్వహించారు. భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ సెక్రటరీ జి.రాజేంద్రప్రసాద్, జాయింట్ సెక్రటరీ వి.వాగ్దేవి, ఉప విద్యాశాఖాధికారి విజయకుమారి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు, నిక్కు అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## రాపాక రోడ్డులో పెట్రోల్ బంక్ ప్రారంభం

**పొందూరు, డిసెంబర్ 22 (వార్త):** పొందూరు మండలంలోని రాపాక జంక్షన్ వద్ద బాడాన శేషగిరి నిర్మించిన వెంకట పాపినాయుడు ఫిల్లింగ్ స్టేషన్ (పెట్రోల్ బంక్)ని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో శేషగిరి కుటుంబ సభ్యులతో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.





## ఘనంగా గేదెల చైతన్య జన్మదిన వేడుకలు

**ఎల్ఎన్‌పేట/హిరమండలం, డిసెంబర్ 22 (వార్త):** పాతపట్నం నియోజకవర్గంలో హిరమండలం, పాతపట్నం, మెళియాపుట్టి, కొత్తూరు, ఎల్ఎన్‌పేట మండలాల్లో జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ గేదెల చైతన్య జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు క్రిస్టమస్ హైటీ వేడుకలు

**శ్రీకాకుళం,డిసెంబర్22 (వార్త):** క్రిస్టమస్ వేడుకలకు అందరూ ఆహ్వానితులేనని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. క్రిస్టమస్‌ను పురస్కరించుకుని కోడిరామమూర్తి స్టేడియం ప్రక్కన గల డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కళావేదికలో సోమవారం ఉదయం పదిగంటలకు హైటీ వేడుకలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి క్రిస్టియన్ మత పెద్దలు, జిల్లాలోని ఆయా సంఘాలకు సంబంధించి సంఘ కాపరులు, మైనార్టీ నాయకులు హాజరుకావాలని కోరారు.

## 60 లీటర్ల నాటు సారా స్వాధీనం

**సోంపేట, డిసెంబర్ 22 (వార్త):** కంచిలి మండలం కొరంజి భద్ర గ్రామానికి చెందిన కర్రి నరసింహ నుంచి 60 లీటర్లు నాటు సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు బారువా ఎస్సై ఎస్ హరిబాబు నాయుడు తెలిపారు. సోంపేట మండలం కొరంజి భద్ర బస్టాండ్‌లో దాడి చేసి ఆదివారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.





## మానవ వనరుల అభివృద్ధే..
# దేశానికి సంపద

* రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు
* కోటబొమ్మాళిలో కేజీబీవీ అదనపు భవనాలు ప్రారంభం

**టెక్కలి, డిసెంబర్ 22 (వార్త):** మానవ వనరుల అభివృద్ధే దేశానికి పెద్ద సంపదని, నాణ్యమైన విద్యతోనే నైపుణ్యం గల మానవ వనరులు తీర్చిదిద్దడం సాధ్యపడుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. కోటబొమ్మాళి మండలం కొత్తపేటలో కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయంలో రూ. కోటి పది లక్షలతో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదుల భవనాన్ని ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2011లో ఇక్కడి కస్తూరిబా గాంధీ పాఠశాల ఆరు నుండి పదవ తరగతి వరకూ ప్రారంభమైందని, తమ హయాంలోనే 2018లో జూనియర్ కళాశాలగా అప్ గ్రేడ్ చేసామని గుర్తు చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వమే అధికారంలోకి వచ్చేటప్పటికి 35 శాతం పనులతో అర్ధాంతరంగా నిలిచిన అదనపు తరగతుల భవనాన్ని త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. పాఠశాలలో విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు, ఆర్ట్స్, క్రాఫ్ట్స్ లాంటి అంశాలలో మెరుగైన శిక్షణ ఇవ్వడం ద్వారా శారీరిక, మానసిక దృఢత్వాన్ని సాధించే విధంగా తీర్చిదిద్దవచ్చని పేర్కొన్నారు. పాఠశాల ప్రక్కనే 13 సెంట్లు ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉందని, దీనిని ఆట స్థలం కోసం కేటాయించడానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. అలాగే పాఠశాల ప్రహరీ గోడ ఎత్తు తక్కువగా ఉందని, దానిని పెంచడానికి తగిన అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. పాఠశాలలో అదనపు డార్మెటరీలను నిర్మించడానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అందరికీ నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విద్యను అందించడానికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడానికి నూతన భవనాలను నిర్మించడం, మెరుగైన వసతులను కల్పించడం ద్వారా విద్యాభివృద్ధికి తమ ప్రభుత్వం అంకితభావాన్ని చాటుకుంటుందని చెప్పారు. పాఠశాలల్లో బోధనా విధానంపై దృష్టి సారించడంతో పాటు పాఠశాలల్లో సౌకర్యాలు, డిజిటలీకరణ రూపంలో విద్యా మౌలిక సదుపాయాలు క్రమంగా ప్రోత్సహిస్తున్నామన్నారు. సమగ్ర శిక్ష, ఆర్‌టీఈ చట్టం, పాఠశాల మౌలిక సదుపాయాలు, సౌకర్యాల మెరుగుదల, రెసిడెన్షియల్ హాస్టల్ భవనాలు, ఉపాధ్యాయుల లభ్యత, ఉపాధ్యాయులకు నిరంతర శిక్షణ, ఉచిత పాఠ్య పుస్తకాలు, పిల్లలకు ఏకరూప దుస్తులు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు, పీఎం పోషణ్ వంటి పథకాలు పాఠశాలల్లో పిల్లల నమోదును పెంపొందించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని వివరించారు. కళాశాల భవనాల ప్రారంభోత్సవం అనంతరం, కోటబొమ్మాళి పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొని తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను అక్కడికక్కడే ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య, ఈఈ రమణమూర్తి, ఏఈ రమానాయుడు, ప్రిన్సిపల్ కే లక్ష్మీ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీనివాస రామానుజన్ జయంతి

**శ్రీకాకుళం టౌన్, డిసెంబర్ 22 (వార్త):** శ్రీకాకుళం గీతం డిగ్రీ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్. రమేష్ ఆధ్వర్యంలో శ్రీనివాస రామానుజన్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. గణిత అవధాని మడ్డు తిరుపతి రావు హాజరై, రామానుజన్ జీవిత విషయాలను, వివరిస్తూ గణిత దశావధానం కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ రమేష్ మాట్లాడుతూ మాట్లాడుతూ సరియైన బోధన పద్ధతులు ఉపయోగించి సరియైన విధానంలో బోధిస్తే గణితం చాల వినోదదాయకంగా, విజ్ఞానదాయకంగా ఉంటుందన్నారు. గణిత అవధాని మడ్డు తిరుపతి రావు మాస్టర్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వలన విద్యార్థులకు గణితంపైన ఆసక్తి పెరుగుటకు దోహద పడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది స్వర్ణలత, కృష్ణ వేణి, సీత, కేశవి, శిరీష, నరేష్, రమణమూర్తి, నాగేశ్వరరావు, శ్రీను, నాయుడు, రవి, విద్యార్థులు పాల్గొన్నారు.




## గణితంలో విద్యార్థులు టాలెంట్

**సోంపేట, డిసెంబర్ 22 (వార్త):** జ్ఞానోదయ కేంద్రం (గ్రంథాలయం) ఆధ్వర్యంలో సోంపేట, దూగానపుట్టుగ గ్రామాలలో జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా 10వ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్‌ను నిర్వాహకులు ఆదివారం నిర్వహించారు. 140 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. శిలగాం జడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎన్ చరణ్ మొదటి బహుమతి కైవసం చేసుకోగా, కవిటి ఉన్నత పాఠశాల విద్యార్థిని నెయ్యల హాసిని ద్వితీయ, సోంపేట జేవై హైస్కూల్ విద్యార్థిని పి.దీప్సి శ్రీ, మాణిక్యపురం ఉన్నత పాఠశాల విద్యార్థి బోరుభద్ర చరణ్ ప్రోత్సాహక బహుమతులు సాధించారు. ఈ కార్యక్రమానికి బూరగాంకు చెందిన గణిత ఉపాధ్యాయులు అష్టావధాని మడ్డు తిరుపతిరావు, సైన్స్ ఉపాధ్యాయులు ప్రమోద్ పాడి , సోంపేట ట్రెజరీ ఇన్చార్జ్ అధికారి మజ్జి శ్రీధర్ పాల్గొని గణితంలో మెలకువలను వివరించారు. విజేతలకు బహుమతుల ప్రధానం అనంతరం మడ్డు తిరుపతిరావు, ప్రమోద్, మజ్జీ శ్రీధర్‌లకు గ్రంథాలయం సభ్యులు సన్మానించి మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయం సంచాలకులు దూగాన తిరుపతిరావు ఉపాధ్యాయులు బల్ల కాంతారావు, తోపాటు విద్యార్థులు, యువకులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు







# వేడుకగా.. సెమీ క్రిస్మస్

* కీస్టోన్ చర్చిలో ప్రత్యేక ప్రార్ధనలు * నగరంలో క్రైస్తవుల ర్యాలీ * శాంతి దూత.. ఏసు * కీస్టోన్ చర్చి పాస్టర్ జోయిల్ శాం

శ్రీకాకుళం టౌన్, డిసెంబర్ 22 (వార్త): నగరంలోని డగ్లస్ స్కూల్ క్యాంపస్ ఆవరణలో ఉన్న కీస్టోన్ చర్చిలో ఆదివారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. చర్చిలో పాస్టర్ జోయిల్ శాం, హనా జోయిస్‌లు ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. అంతకుముందు చర్చి ఆవరణ నుంచి రామలక్ష్మణ జంక్షన్, సూర్యమహాల్ జంక్షన్, జీటీ రోడ్డు, డే అండ్ నైట్ జంక్షన్, రైతు బజార్ మీదుగా పీఎన్ఎం స్కూల్ మీదుగా తిరిగి డగ్లస్ స్కూల్ వరకూ క్రైస్తవులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఏసు గీతాలను ఆలపించారు. చిన్నారుల శాంతాక్లాజ్ వేషాధారణ ఆకట్టుకుంది. కీస్టోన్ చర్చి ఆవరణను విద్యుద్దీపాలతో ముస్తాబు చేశారు.













Printed and published and Owner by Shaik Sahid, printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Working Editor: Chowdari Pramod, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546